క్లుప్తంగా

వైఎస్సార్ బీమా సాయం అందజేత



బాధితురాలికి రూ.10వేలను అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

బనగానపల్లె రూరల్ : మండలంలోని ఎర్రగుడి గ్రామానికి చెందిన నాయిని నాగేష్(49 గుండె పోటుతో మృతి చెందారు. ఈ మేరకు బుధవారం గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులు రామ సుబ్బారెడ్డి, సచివాలయ సోషియల్ వెల్ఫేర్ అసిస్టెంట్ సుధాకర్‌నాయక్‌ల చేతుల మీదుగా వైఎస్సార్ బీమా తక్షణ సాయం రూ.10వేలను మృతుడి భార్య మద్దమ్మకు అందజేశారు. కార్యక్రమంలో వలంటీర్ బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిబంధనలు పాటించాలి

బేతంచెర్ల: వాహన చోదకులు రోడ్డు నిబంధనలు పాటించి ప్రమాదాల కట్టడికి సహకరించాలని డోన్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ క్రాంతి కుమార్, ఎస్‌ఐ శివ శంకర్ నాయక్ సూచించారు. పట్టణంలోని జీవీఆర్ ఫంక్షన్ హాల్‌లో బేతంచెర్ల లారీ ఓనర్స్ వెల్ఫేర్ అసోషియేషన్ ఆధ్వర్యంలో రహదారి భద్రత వారోత్సవాల్లో భాగంగా లారీ యజమానులు డ్రైవర్లు, ఆటో డ్రైవర్లకు రహదారుల అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడపవద్దని, ద్విచక్రవాహనచోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. కార్యక్రమంలో లారీ ఓనర్స్ అసోషియేషన్ గౌరవ అధ్యక్షులు గౌరి హుసేన్‌రెడ్డి, అధ్యక్షుడు శ్రీనివాసులు రెడ్డి సభ్యులు మల్లు సుబ్బారెడ్డి, మద్దిలేటి, కొండారెడ్డి, సుబ్బారెడ్డి, రామేశ్వర్ రెడ్డి, మహేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

బస్సులన్నీ ప్లాట్ ఫాంలోకి రావాలి

కొలిమిగుండ్ల: మండల కేంద్రం కొలిమిగుండ్లలో ప్రధాన రహదారి పక్కనే ఆర్టీసీ బస్టాండ్ ఉన్నా బస్సులు ప్లాట్‌ఫాంలోకి రాక పోవడంతో టికెట్ చెకింగ్ అధికారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం చెకింగ్ చేస్తున్న సమయంలో బనగానపల్లె డిపోకు చెందిన బస్సులు బస్టాండ్ లోపలకి రాకుండానే ప్రధాన రహదారిపైనే నిలిపి ప్రయాణీకులను ఎక్కించుకోవడం,దించడంతో అధికారులు గమనించారు. ఇకపై బనగానపల్లె డిపో బస్సులు ప్లాట్‌ఫారంలోకి రాక పోతే డ్రైవర్,కండక్టర్‌తో పాటు డిపోపై కేసు రాస్తామని హెచ్చరించారు.

పెరటి కోళ్ల పెంపకం లాభదాయకం



పెరటి కోళ్లను పంపిణీ చేసిన దృశ్యం

బనగానపల్లె : పెరటి కోళ్ల పెంపకం లాభదాయకంగా ఉంటుందని యాగంటిపల్లె కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే) సీనియర్ ప్రధాన శాస్త్రవేత్త ధనలక్ష్మీ పేర్కొన్నారు. నార్మ హైదరాబాద్ సహకారంతో హరిజన ఉపప్రణాళికలో భాగంగా బుధవారం మూడు రోజుల శిక్షణ ముగింపు కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. మహిళలు పెరటికోళ్ల పెంపకంపై దృష్టి సారించాలని సూచించారు. నార్మ ప్రిన్సిపాల్ సైంటిస్ట్ డాక్టర్ బాలకృష్ణ మాట్లాడుతూ 76శాతం హరిజనులు వ్యవసాయ కూలీలుగా జీవనంసాగిస్తున్నారని, వారికి జీవనోపాధి అవకాశాలు కల్పించాలన్న ఉద్దేశంతో పెరటి కోళ్లతోపాటు ఉచితంగా దాణా పంపిణీ చేస్తున్నామన్నారు. అనంతరం పెరటి కోళ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు కృష్ణమూర్తి, డాక్టర్ బ్రహ్మనందరెడ్డి, ఏఓ సురేషకుమార్, రమణయ్యగౌడ్, సుధాకర్, రవిగౌడ్, ఆదినారాయణ పాల్గొన్నారు.

నేడు వాహనాల వేలం

డోన్ టౌన్ : వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలను గురువారం జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు డీఎస్పీ శ్రీనివాసరెడ్డి, సీఐ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో స్థానిక పట్టణ పోలీసు స్టేషన్‌లో వేలం పాటలు నిర్వహిస్తున్నట్లు పట్టణ ఎస్‌ఐ శరత్‌కుమార్ రెడ్డి బుధవారం ప్రకటనలో తెలిపారు. ఈ వేలాల్లో పాటలో వాహనాలు దక్కించుకున్న వ్యక్తులు ధరావత్తుతో పాటు జీఎస్టీ చెల్లించాల్సి ఉంటుందని ఆయన తెలిపారు.

ఆదుకున్న అప్రమత్తత!

- అన్నదాతకు అండగా నిలిచిన అధికారులు
- తుపాన్ నుంచి పంటలు, దిగుబడులను కాపాడుకున్న రైతులు
- వలంటీర్, ఆర్బీకే సిబ్బంది సేవలను అభినందిస్తున్న వైనం



బేతంచెర్ల : కేకే కొట్టాలలో మిరప దిగుబడులపై టార్పాలిన్ కప్పిన దృశ్యం



కోవెలకుంట్ల సమీపంలో దిగుబడులపై పట్టాలు కప్పిన దృశ్యం

డోన్/బనగానపల్లె : అధికారులు అప్రమత్తంగా వ్యవహరించడంతో తుపాన్ ప్రభావం నుంచి రైతన్న బయపటపడ్డాడు. భయపెట్టిన తుపాన్ ప్రభావం బనగానపల్లె, డోన్ నియోజకర్గాల్లో ఏ మాత్రం చూపలేదు. ప్రత్యేకించి వలంటీర్లు రైతులతోపాటు ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయడంతో పంటలను కాపాడుకోగలిగారు. రెవెన్యూ, పోలీసు, విద్యుత్, పంచాయతీ, మున్సిపల్, వ్యవసాయ, ఉద్యానవన శాఖల అధికారుల సమన్వయంతోపాటు వలంటీర్లు, ఆర్బీకే సిబ్బంది చేసిన సూచనలు రైతులు అభినందిస్తున్నారు. డోన్ నియోజకవర్గంలోని డోన్, ప్యాపిలి, బేతంచెర్ల మండలాల్లో అరటి, మామిడి, బొప్పాయి, నిమ్మ, సపోట తదితర పంటలను 25.6 హెక్టార్లలోనూ, కర్బూజ, డ్రాగన్‌ఫ్రూట్, ఆపిల్, క్యాలిఫ్లవర్ పంటలను 12.4 హెక్టార్లలో, టమాట, బీన్స్, ఆలు, చిక్కుడు తదితర కూరగాయలను 90.20 హెక్టార్లలో, మిరప, పత్తి తదితర వాణిజ్య పంటలను 241 హెక్టార్లలో రైతులు సాగు చేశారని ఉద్యానవనశాఖ ఏడీఏ కళ్యాణి తెలిపారు. అకాల వర్షాల కారణంగా పంట దిగుబడులకు ఎలాంటి నష్టం కలగకుండా ఆర్బీకే ఉద్యోగులు, అధికారులు, వలంటీర్లు నిరంతరం రైతులకు అందుబాటులో ఉంటూ అండగా నిలిచారు. అదేవిధంగా బనగానపల్లె నియోజకవర్గంలోని కోవెలకుంట్ల, సంజామల, అవుకు, కొలిమిగుండ్ల, బనగానపల్లె మండలాల్లో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో 11,713 ఎకరాల్లో రైతులు వరి సాగు చేశారు. వలంటీర్ల సూచనల మేరకు వరి రైతులు అప్రమత్తంగా వ్యవహరించారు. దిగుబడలను ఇళ్లకు చేర్చుకుని కాపాడుకున్నారు. నూర్పిడి పనులు వాయిదా వేసుకున్నారు. దీంతో పంట నష్టం జరగలేదు. అయితే అకాల వర్షాలు రబీ పంటలకు ఊరట నిచ్చాయని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. పప్పుశనగ, మినుము, పెసర, ధనియాలు, కొర్ర, ఆముదం, జొన్న తదితర పంటలకు వర్షం ఊపిరి పోసిందంటున్నారు రైతులు.

ముందస్తు హెచ్చరికలు జారీ

ప్రభుత్వం ఆదేశాల మేరకు తుపాన్ ప్రభావిత ప్రాంతాల్లో అకాల వర్షాల గురించి ముందస్తు హెచ్చరికలు జారీ చేశాం. గ్రామాల్లో దండోరలు వేయించి రైతులు, ప్రజలను అప్రమత్తం చేశాం. ఈ విషయంలో వలంటీర్లు కీలకంగా వ్యవహరించారు. పంట సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి తెలియజేసి రైతాంగానికి అండగా నిలిచారు.

– శ్రీనివాసులు, ఎంపీడీఓ, డోన్.

బాధ్యతగా భావించాం



తుపాన్ ప్రభావాన్ని రైతులకు వివరించడం బాధ్యతగా భావించాం. ప్యాపిలి మండలంలోని జక్కసానికుంట్ల గ్రామంలో అకాల వర్షాలకు గడ్డివాములు పూర్తిగా తడిసిపోతాయని ముందే పసిగట్టాం. గడ్డి నానితే నల్లబడి పశువులకు సైతం మేత పనికిరాదని రైతాంగాన్ని చైతన్యపరిచాం. గడ్డివాములపై టార్పాలిన్లు కప్పుకునే విధంగా కృషి చేసి సఫలీకృతులమయ్యాం.

– శ్రీనివాసులు, వలెంటీర్, జక్కసానికుంట్ల గ్రామం, ప్యాపిలి మండలం.

అధికారుల సేవలు అభినందనీయం



తుపాన్ ప్రభావంతో రైతులు ఇబ్బంది పడకుండా అధికారులు చేసిన సూచనలు అభినందనీయం. పంట సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ఆర్బీకే సిబ్బంది, వలంటీర్ల సలహాలు ఉపయోగపడ్డాయి. వలంటీర్ల సూచనల మేరకు నేను ఐదుఎకరాలలో నాటిన ఉల్లిపంటను సమర్థవంతంగా రక్షించుకోగలిగా.

– రామేశ్వరరెడ్డి, రైతు, కొచ్చెర్వు, డోన్ మండలం.

నేడు మండల మీట్

అవుకు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ వెంకటేశ్వర రెడ్డి బుధవారం తెలిపారు. సమావేశానికి ఎంపీపీ చల్లా రాజశేఖర్ రెడ్డి అధ్యక్షత వహిస్తారని, ఆయా శాఖల అధికారులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు హాజరు కావాలని ఎంపీడీఓ తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ల సీజ్

కోవెలకుంట్ల: ఎలాంటి రాయల్టీ లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను బుధవారం సీజ్ చేసినట్లు ఎస్‌ఐ వెంకటరెడ్డి తెలిపారు. వైఎస్సార్ జిల్లా జమ్మలమడుగు, అనంతపురం జిల్లా తాడిపత్రి నుంచి అనుమతులు లేకుండా ట్రాక్టర్లలో కోవెలకుంట్ల వైపు ఇసుకను తరలిస్తున్నారు. అందిన సమాచారం మేరకు పోలీసులు దాడి చేసి ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నారు. ఇసుక తరలింపునకు సంబంధించి రాయల్టీ రికార్డులు లేకపోవడంతో సీజ్ చేసి మైనింగ్ శాఖకు అప్పగించినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

ఉచిత కంప్యూటర్ శిక్షణను సద్వినియోగం చేసుకోండి

బనగానపల్లె రూరల్ : మండలంలోని యాగంటిపల్లె గ్రామ సమీపంలో ఉన్న కృషి విజ్ఞాన కేంద్రంలో ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో డెటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సుకు ఇస్తున్న ఉచిత శిక్షణ సద్వినియోగం చేసుకోవాలని కేవీకే ప్రధాన సీనియర్ శాస్త్రవేత్త ధనలక్ష్మీ బుధవారం సూచించారు. ఇంటర్ పాసై 18–30 సంవత్సరా లోపు వయసు నిరుద్యోగ అభ్యర్థులు ఈ నెల 8లోపు పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. మూడు నెలల పాటు ఉచితంగా శిక్షణ ఉంటుందని ఆమె తెలిపారు.

ఈవీఎంలపై అవగాహన



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆర్‌ఓ కామేశ్వరరావు

బనగానపల్లె రూరల్ : స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం బనగానపల్లె నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్(ఆర్‌ఓ) అధికారి కామేశ్వరరావు ఈవీఎంలపై (ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్) రెవెన్యూ సిబ్బందికి అవగాహన కార్యక్రమం జరిగింది. ఆర్‌ఓ మాట్లాడుతూ ఈవీఎంలపై అవగాహన ఉంటేనే ఎన్నికల విధుల్లో తగిన జాగ్రత్తలు తీసుకునేందుకు సులువుగా ఉంటుందన్నారు. కర్నూలు నుంచి వచ్చిన మాస్టర్ ట్రైనర్ రాజశేఖర్ ఈవీఎంలోని కంట్రోల్ యూనిట్, బ్యాలెట్ యూనిట్, వీవీ ప్యాడ్ అంటే ఏమిటి, వీటి ద్వారా ఓటరు తన ఓటు హక్కును ఏలా వేయాలి తదితర అంశాలను వివరించారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ పవన్‌కుమార్‌రెడ్డి, ఏఎస్‌ఓ వెంకట్రామిరెడ్డి, కోవెలకుంట్ల, సంజామల తహసీల్దార్‌లు పుష్పకుమారి, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అయ్యప్పస్వామి విళక్కి పూజ



కోవెలకుంట్ల: గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం



అవుకు: స్వామివారి గ్రామోత్సవంలో పాల్గొన్న భక్తులు

కోవెలకుంట్ల: స్థానిక గాంధీనగర్‌లో వెలసిన హరిహర అయ్యప్పస్వామి దేవాలయంలో బుధవారం విళక్కి(దీపోత్సవం) పూజ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం అయ్యప్ప మాలధారణ భక్తులు కుందూనది నుంచి కులశాలతో నీటిని తెచ్చి అయ్యప్పస్వామికి అష్టాభిషేకం తదితర పూజలు నిర్వహించారు. అనంతరం కేరళవారి శింగారి మేళ తాళాల మధ్య స్వామివారి గ్రామోత్సవం వైభవంగా కొనసాగింది. మేజర్ గ్రామ పంచాయతీ ఉపసర్పంచ్ జీసీఆర్ సూర్యనారాయణరెడ్డి, రైతు సంఘం అధ్యక్షుడు కానాల రవీంద్రనాథరెడ్డి, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ బీవీ నాగార్జునరెడ్డి, భీమిరెడ్డి ప్రతాప్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు వాసగిరి సాయికృష్ణమూర్తి, శోభారాణి, ఆలయ కమిటీ సభ్యులు విశ్వనాథం, మురళీకృష్ణ, గడ్డం నాగేశ్వరరెడ్డి, తదితరులు స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. విళక్కి పూజ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

అవుకు: మండల కేంద్రం అవుకులో అయ్యప్ప మాలధారణ స్వాముల ఆధ్వర్యంలో బుధవారం స్వామివారికి ఘనంగా గ్రామోత్సవం నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన అయ్యప్ప స్వామిని అ య్యప్ప స్వామి ఆలయ సమీపం నుంచి చిన్నారుల చేత దీపాలను వెలిగించి గ్రామోత్సవాన్ని ప్రారంభించారు.

భక్తి శ్రద్ధలతో కాశీనాయన ఆరాధనోత్సవం



ప్రత్యేక అంకరణ మెట్లపూజలో కాశిరెడ్డినాయన



స్వామిని దర్శించుకునేందుకు తరలివచ్చిన భక్తులు

సంజామల: మండల పరిధిలోని అల్వకొండ క్రాస్‌లో వెలసిన కాశీనాయన ఆశ్రమం 28వ ఆరాధన మహోత్సవాలు బుధవారం భక్తి శ్రద్ధల మధ్య జరిగాయి. ఆశ్రమంలో వెలసిన సకల దేవతల హోమం, పూర్ణహుతి, అభిషేకాలు, అర్చనలు తదితర పూజలు నిర్వహించారు. కేడీసీపీ కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్, వైఎస్సార్ సీపీ లదనపు కార్యదర్శి గుండం సూర్య ప్రకాస్ రెడ్డి, మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ మల్కిరెడ్డి వెంకట సుబ్బారెడ్డి తదితర ప్రముఖులు స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆశ్రమం పర్యవేక్షకులు పోచ శీలా రెడ్డి, పోచ శంకర్ రెడ్డి, చంద్ర మోహన్ రెడ్డి, పోచ వెంకట్రామిరెడ్డి ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. చెక్కభజన, ఆధ్యాత్మిక ప్రవచనాలు, కాశికావేషం, భక్త చింతామణి నాటకం తదితర సాంస్కృతి కార్యక్రమాలు అలరించాయి. ఉదయం నుంచి రాత్రి 12 గంటల వరకు జ్ఞానజ్యోతి దర్శనం వరకు భక్తులు పోటెత్తారు. సీఐ రామాంజులు, ఎస్‌ఐ ప్రతాప్ బందోబస్త్ పర్యవేక్షించారు.

హోరాహోరీగా రాతిదూలం లాగుడు పోటీలు

ఆరాధనోత్సవం సందర్భంగా నిర్వహించిన వృషభాల రాతి దూలం పోటీలు హోరాహోరీగా సాగాయి. విజేత వృషభరాజముల యజమానులకు రూ.60వేలు, రూ.50వేలు, రూ.40వేలు, రూ.30 వేలు,రూ.25వేలు,రూ.15వేలు,రూ.10వేలు,రూ.5వేలు చొప్పున బహుమతులు అందజేశారు. కబడ్డీ పోటీలను వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి గుండం సూర్య ప్రకాష్ రెడ్డి, మాజీ జడ్పీ చైర్మన్ మల్కిరెడ్డి వెంకట సుబ్బారెడ్డి, ముక్కమల్ల మాజీ సర్పంచ్ పోచ వెంకట రామిరెడ్డి, ఆకుమల్ల సొసైటీ బ్యాంక్ చైర్మన్ గౌరిగారి నాగేశ్వర్ రెడ్డి, కాశిపురం, గిద్దలూరు నాయకులు అయ్యపు రెడ్డి, రామ చంద్రా రెడ్డి ప్రారంభించారు.

ఉత్సాహంగా గార్ధబాల పరుగు పందేలు

రజక సంఘం రాష్ట్ర కార్యదర్శి మద్దిలేటి ఆల్వకొండ వైఎస్సార్‌సీపీ నాయకులు ఎస్‌సీ బాబు ఆధ్వర్యంలో నిర్వహించిన గార్ధబాల పరుగు పందెలు ఉత్సాహంగా సాగాయి. ఎనభైపళ్ల ఇసుక మూట బరువుతో పది నిమిషాల వ్యవధితో నిర్వహించిన రాష్ట్ర స్థాయి గార్ధబాల పరుగు పోటీల్లో వేలుగోడు మండలం వల్సనూరుకు చెందిన సురేంద్ర గార్ధబం ప్రథమ స్థానం నిలిచి రూ.20 వేలు కైవసం చేసుకుంది. కడప జిల్లా పెద్దముడియం మండలం జంగలపల్లెకు చెందిన అంజి గార్ధబం రూ.15 వేలు ద్వితీయ బహుమతి కైవసం చేసుకుంది. సంజామల మండలం ముక్కమల్లకు చెందిన ఓబన్న గార్ధబం తృతీయ బహుమతి రూ.10 వేలు కై వసం చేసుకుంది. చాగలమర్రి మండలం పెద్దబంగలికి చెందిన పెద్ద పాములేటి గార్ధబం నాల్గువ బహుమతి రూ.6 వేలు, చిన్నబంగలి గ్రామానికి చెందిన గార్ధబం ఐదవ బహుమతి రూ.5 వేలు కైవసం చేసుకున్నాయి.

మేలు చేసిన ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి



సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న దృశ్యం



వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్



మాట్లాడుతున్న మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు

కోవెలకుంట్ల: ప్రజల సంక్షేమం, రాష్ట్రాభివృద్ధే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన చేస్తున్నారని, ప్రజలకు ఎంతో మేలు చేస్తున్న జగనన్నను మరోసారి ఆశీర్వదించాలని మండల ఉపాధ్యక్షురాలు షాజహాన్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బీవీ నాగార్జునరెడ్డి కోరారు. స్థానిక మేజర్ గ్రామ పంచాయతీలోని ఐదవ సచివాలయాల పరిధిలో బుధవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఉపసర్పంచ్ జీసీఆర్ సూర్యనారాయణరెడ్డి, గ్రామ సచివాలయ మండల కన్వీనర్ మధుసూదన్‌రెడ్డి, చిక్కేపల్లి ప్రసాదరెడ్డి తదితరులతో కలిసి వారు సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించి పార్టీ జెండాను ఎగురవేశారు. సచివాలయ పరిధిలో సంక్షేమ పథకాల ద్వారా రూ. 16.28 కోట్లు, నాన్ డీబీటీ ద్వారా రూ. 9.05 కోట్లు, వివిధ అభివృద్ధి పనులకు రూ. 4.24 కోట్లు వెచ్చించినట్లు ఈ సందర్భంగా ఎంపీడీఓ సయ్యదున్నీసా తెలిపారు. కార్యక్రమంలో ఈఓ గోపినాథ్, నాయకులు సుధాకర్‌రెడ్డి, దేవరాజు, బాలరాజు, సుబ్బరాయుడు, ఎంఎల్‌ఓ రమేష్ పాల్గొన్నారు.

ప్యాపిలి: గ్రామాలను అభివృద్ధే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలన సాగిస్తున్నారని జెడ్పీటీసీ సభ్యులు బోరెడ్డి శ్రీరామిరెడ్డి, డోన్ మార్కెట్‌యార్డు చైర్మన్ రాజానారాయణమూర్తి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు బొర్రా మల్లికార్జునరెడ్డి అన్నారు. స్థానిక నాల్గవ సచివాలయం ఆవరణలో బుధవారం పల్లెకు పోదాం కార్యక్రమాన్ని నిర్వహించారు. సర్పంచ్ లక్ష్మీదేవి అధ్యక్షతన ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యులు దిలీప్ చక్రవర్తి, వైఎస్సార్‌సీపీ నాయకులు రాజా మురళీకృష్ణ, బషీర్, పర్వతం శ్రీను, సంజీవరెడ్డి, కొండయ్య, సోమశేఖర్, గండికోట రామాంజనేయులు, బోరెడ్డి ప్రభాకర్ రెడ్డి, సీబిల్లి రంగన్న, రమణ, బోరెడ్డి రఘు, ఇమాముద్దీన్, పెద్దిరాజు, నిజాం, నాగన్న తదితరులు పాల్గొన్నారు.

డోన్ : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారని, అర్హులందరికీ నేరుగా సంక్షేమ ఫలాలు అందజేస్తున్నారని మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ అన్నారు. పట్టణ అధ్యక్షులు కురుకుంద హరి, కౌన్సిలర్లు దినేష్‌గౌడ్, మహేష్‌గౌడ్, స్వర్ణలతల ఆధ్వర్యంలో స్థానిక 8వ సచివాలయం పరిధిలో 12, 13వ వార్డుల్లో బుధవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను చైర్మన్ వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకట్రామిరెడ్డి, నాయకులు సతీష్, రబ్బానీ, బలరాముడు, బడేసా, జహరాభీ తదితులు పాల్గొన్నారు.

డోన్ రూరల్ : డోన్ నియోజకవర్గంలో ఎక్కడ కూడ నీటి సమస్యలేకుండా శాశ్వతంగా పరిష్కారం చేస్తామని రాష్ట్ర మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు అన్నారు. మండల పరిధిలోని వెంకటనాయునిపల్లి గ్రామంలో బుధవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని ఎంపీడీఓ శ్రీనివాసులు ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు రామచంద్రుడు, గ్రామ సర్పంచ్ శీలం చంద్రశేఖర్‌నాయుడు, గ్రామ వైస్సార్ సీపీ నాయకులు రాంకుమార్‌యాదవ్, జానకి రాముడు, పెద్ది రాజ్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కుల గణనకు సహకరించాలి



రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్న

డోన్ టౌన్ : కుల గణనకు ప్రతి ఒక్కరూ సహకరించాలని తహసీల్దార్ విద్యాసాగర్, ఎంపీడీఓ శ్రీనివాసులు, రాష్ట్ర మీట్ కార్పొరేట్ చైర్మన్ శ్రీరాములు, ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి కోరారు. స్థానిక ఆర్ అండ్ బీ గెస్ట్ హౌస్‌లో బుధవారం కుల సంఘాల నాయకులు, ప్రజా ప్రతినిధులతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. కుల సంఘాల నాయకులు సూచనలు,సలహాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 10వ తేది నుంచి కుల గణను చేపడుతున్నట్లు తెలిపారు.

రెండిళ్లలో చోరీ

ప్యాపిలి: మండల కేంద్రం ప్యాపిలిలో ఒకే రోజు మూడు ఇళ్లలో చోరీ జరిగింది. బీసీ కాలనీలో నివాసం ఉంటున్న జింకల రమేష్ కుటుంబ సభ్యులు రెండు రోజుల క్రితం ఊరికి వెళ్లారు. బుధవారం వచ్చి చూడగా ఇంటి తాళం పగులగొట్టి ఉంది. 1.5 తులం బంగారు నగలు, 20 తులాలు వెంటి, రూ. 10 వేలు నగదు అపహరణకు గురైనట్లు గుర్తించారు. ఇదే కాలనీకి చెందిన ప్రసాద్ ఇంట్లో 2 తులలా బంగారు నానేలు, జత బంగారు కమ్మలు అపహరణకు గురయ్యాయి. అలాగే గోపాల్ అనే వ్యక్తి ఇంటి తాళాలను సైతం దండగులు పగులగొట్టేందుకు విఫల యత్నం చేశారు. ఈ మేరకు బాధితులు ప్యాపిలి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

బడి ఈడు పిల్లలతో పనులు చేయించరాదు

ప్యాపిలి: బడికి వెళ్లాల్సిన పిల్లలతో పనులు చేయించడం నేరం అని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇంచార్జ్ ప్రిన్సిపాల్ రామకృష్ణయ్య, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ నవీనపాటి అన్నారు. ఈ మేరకు బుధవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పిల్లలను చదివించి వారి ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేయాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందన్నారు. కార్యక్రమంలో లెక్చరర్లు సత్యబాబు, నవీన్, ఓబులేసు, వెంకటేశ్వర్లు, ముస్తాక్, మద్దిలేటి పాల్గొన్నారు.

ఉచిత సోలార్ శిక్షణకు దరఖాస్తు చేసుకోండి

బేతంచెర్ల: పట్టణ సమీపాన డోన్ రహదారిలోని పద్మావతి ఐటీఐ కళాశాల్లో పీఎంకేవీవై కింద 3 నెలల పాటు ఉచితంగా సోలార్ పై శిక్షణ ఇస్తున్నట్లు కళాశాల చైర్మన్ దామోదర చౌదరి తెలిపారు. 10 వ తరగతి పాసైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

అంబేడ్కర్ ఆశయాలు సాధిద్దాం



అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీపీ, నగర పంచాయతీ చైర్మన్



బస్టాండ్‌లో అంబేడ్కర్ వర్ధంతి వేడుకల దృశ్యం



అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పింస్తున్న దృశ్యం



నివాళులర్పింస్తున్న నాయకులు

కోవెలకుంట్ల: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ పాటు పడాలని వక్తలు పిలుపునిచ్చారు. అంబేడ్కర్ 67వ వర్ధంతిని పురస్కరించుకుని బుధవారం బనగానపల్లె నియోజకవర్గంలోని ఆయా గ్రామాల్లో ఆయన చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. కోవెలకుంట్ల పట్టణంలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి సుధాకర్, స్థానిక వాసవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ రామసుబ్బారెడ్డి, ఆర్టీసీ బస్టాండ్‌లో ఎస్టీఐ కిషోర్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ వర్ధంతిని నిర్వహించారు.

డోన్ :అంబేడ్కర్ 67వ వర్ధంతిని డోన్ నియోజకవర్గంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మల్లెంపల్లె రామచంద్రుడు, పట్టణ అధ్యక్షుడు కురుకుంద హరి ఆధ్వర్యంలో మంత్రి బుగ్గన స్వగృహం నుండి పోలీస్ స్టేషన్ సమీపానున్న అంబేడ్కర్ విగ్రహం వరకు వైఎస్సార్‌సీపీ శ్రేణులు ర్యాలీ నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంబేడ్కర్ ఆశయాల సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఈ సదర్బంగా రాష్ట్ర మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు, ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్, వైస్ చైర్మన్ కోట్రికె హరి, నంద్యాల జిల్లా బీసీ విభాగం అధ్యక్షుడు పోస్టుపసాద్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

బేతంచెర్ల : ప్రపంచ దేశాలకు ఆదర్శమైన రాజ్యాంగాన్ని దేశానికి అందించిన మహోన్నత వ్యక్తి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని ఎస్‌ఐ శివ శంకర్ నాయక్, ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి అన్నారు. అంబేడ్కర్ వర్ధంతిని పురస్కరించుకుని బుధవారం పట్టణంలోని శేషారెడ్డి సీహెచ్‌సీ ఆవరణలోని ఆయన విగ్రహానికి ఎంపీపీ, చైర్మన్, ఎస్‌ఐతోపాటు ఆర్ఎస్ రంగాపురం సర్పంచ్ గుమ్మగాల్ల రాజు, వార్డు కౌన్సిలర్ కోట్ల మధు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ తిరుమలేశ్వర్‌రెడ్డి, నాయకులు భాస్కర్, బ్రహ్మనాయుడు, కిరణ్, రమేష్, ఎద్దుల సుధాకర్, మునిస్వామి తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ప్యాపిలి: స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో బుధవారం అంబేడ్కర్ వర్ధంతి నిర్వహించారు. అంబేడ్కర్ చిత్రపటానికి జెడ్పీటీసీ బోరెడ్డి శ్రీరామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు బొర్రా మల్లికార్జునరెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు.